క్లుప్తంగా

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

హయత్‌నగర్: జంతు శాస్త్రం బోధించడానికి అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ పాసైన వారు ఇందుకు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 21లోగా ధ్రువపత్రాలతో కళాశాలలో సంప్రదించాలని ఆయన సూచించారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాట రూ. 15, వంకాయ రూ. 23, బెండ రూ. 55, పచ్చిమిర్చి రూ. 30, కాకర రూ. 38, బీర రూ. 52, క్యాబేజి రూ. 18, ఫ్రెంచిబీన్స్ రూ. 45, క్యారట్ రూ. 33, దొండ రూ. 40–45, చిక్కుడు రూ. 50, గోకర రూ. 35, బీట్‌రూట్ రూ. 28, క్యాప్సికం రూ. 55, ఆలు రూ. 28, దోస రూ. 18, సొరకాయ రూ. 13, పొట్లకాయ రూ. 18, ఉల్లిగడ్డ రూ. 44, చామగడ్డ రూ. 35. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఘనంగా ధనుర్మాస వ్రతాలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం వాసవీ కాలనీలోని అష్టలక్ష్మీ దేవాలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవ సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి స్వామి అభిషేకం, ఓంగి పాశురము అన్న కూటోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సోమా సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, మాజీ చైర్మన్ బంధం దామోదర్ గుప్తా, మేడం సుధాకర్ గుప్తా, వైస్ చైర్మన్ నాగమల్లు శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


భక్తి శ్రద్ధలతో సామూహిక గణపతి హోమం



గణపతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

చంపాపేట: సంకట హర చతుర్థి సందర్భంగా బుధవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీ ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ ఈఓ లావణ్య ఆధ్వర్యంలో సామూహిక గణప తి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గణపతికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి భక్తులను ఆశీర్వదించారు. అర్చకులు చంద్రకాంత్ శర్మ, సంతోష్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, అంబ ప్రసాద్‌శర్మ, పవన్‌కుమార్, సిబ్బంది వెంకటయ్య, రమాదేవి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి యువతి వివాహానికి చేయూత



పుస్తె, మెట్టెలు అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: పేద ఆడపిల్లల వివాహానికి ఉప్పల ఫౌండేషన్ ఎల్లప్పుడూ చేయూత అందిస్తుందని ఉప్పల్ ఫౌండేషన్ చైర్మన్, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. బుధవారం ఆయన నాగోలులోని తన క్యాంపు కార్యాలయంలో చింతల్‌కు చెందిన పద్మ,లక్ష్మణ్ రావు దంపతుల కుమార్తె లక్ష్మి అనూష వివాహానికి పుస్తె, మెట్టెలు, చీర,గాజులు అందజేశారు. కార్యక్రమంలో విప్లవ్ రెడ్డి, రాజు, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

హయత్‌నగర్ : ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మన్సూరాబాద్ డివిజన్, విజయ్‌నగర్ కాలనీకి చెందిన దైద పాపయ్య తండ్రి భిక్షం ఈ నెల 14న సాయంత్రం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం అతని కుమారుడు పాపయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



బస్తీ ఆస్పత్రికి సుస్తీ.!

అందుబాటులో ఉండని వైద్యులు
- మూతపడిన నువ్వలబండ బస్తీ దవాఖానా
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేదలు

నాగోలు: ప్రతి ఒక్కరికి వైద్యం అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం వివిధ ప్రాంతాల్లో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసింది. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స కోసం పెద్ద మొత్తంతో ఖర్చులు భరించలేని ప్రజలకు బస్తీ దవాఖానాలే పెద్ద దిక్కవుతుఏన్నాయి. బస్తీ దవాఖానాల్లో 57 రకాల వైద్య సేవలు అందిస్తున్నారు. సాధారణ పరీక్షలు కూడా ఉచితంగానే నిర్వహిస్తున్నారు. గర్భిణులకు స్కానింగ్, శిశువులకు అవసరైన పరీక్షలతో పాటు ఇమ్యునైజేషన్ టీకాలు, రక్తహీనత, బీపీ, షుగర్, కేన్సర్ నిర్ధారణ పరీక్షలు సైతం చేసేవాడురు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత బస్తీ దవాఖానాలపై పాలకులు శ్రద్ధ చూపడం లేదు. దీంతో వైద్యులు, ఇతర సిబ్బంది తరచూ విధులకు గైర్హాజరవుతుండటంతో పేదలకు వైద్య సేవలు అందడం లేదు. ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల్లో వైద్య సేవలు నామ మాత్రంగా మారాయి. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో కొన్ని దవాఖానాలు మూతపడే పరిస్థితి నెలకొంది.

నువ్వలబండలో మూసేశారు..

నువ్వలబండలోని కాలనీ సంక్షేమ సంఘం భవనంలో తాత్కాలికంగా బస్తీదవాఖానా ఏర్పాటు చేశారు. గతంలో ఇక్కడ వైద్యులు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండేవారు. దీంతో నాగోలు పరిసర ప్రాంత వాసులు వైద్య సేవల కోసం ఇక్కడికే వచ్చేవారు. అయితే సంక్షేమ సంఘం భవనంలో స్థలం లేకపోవడం, రేకుల షెడ్డు కారణంగా అధికారులు దవాఖానాను మూసేశారు. దీంతో నాగోలు డివిజన్ పరిధిలోని పేద, మధ్య తరగతి ప్రజలు ఉప్పల్ ప్రభుత్వ ఆస్పత్రి, లేదా మాన్సురాబాద్, వనస్థలిపురంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. నాగోలు డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ బస్తీ దవాఖానాను అందుబాటులో తీసుకురావాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చాలా దూరం వెళ్లాల్సి వస్తోంది...



నాగోలు డివిజన్ ప్రజలకు బస్తీ దవాఖానా అందుబాటు లేదు. వైద్యం కోసం దూరంగా ఉన్న ఉప్పల్, వనస్థలిపురం వెళ్లాల్సి వస్తోంది. ప్రజలకు అందుబాటులో ఉండేలా నాగోలులో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలి.

–మేముగంటి సంపత్, జైపురికాలనీ

అధికారులు స్పందించాలి..



గతంలో నువ్వలబండలో బస్తీ దవాఖానా అందుబాటులో ఉండేది. వైద్యశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా దవాఖానా మూతపడింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్తీ దవాఖానాను అందుబాటులో తీసుకురావాలి.

– సత్యనారాయణ, జైపురికాలనీ

శాశ్వత భవనం నిర్మించాలి..

సాయినగర్‌లో గతంలో వైద్యశాఖ అధికారులు తాత్కాలికంగా అద్దె భవనంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేశారు. అక్కడ హెల్త్ సెంటర్ ఉన్న విషయం ఎవరికీ తెలియకపోవడంతో ప్రజలు వైద్యం కోసం దూరంగా ఉండే ప్రైవేట్ లేదా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తున్నారు. గతంలో బండ్లగూడ సర్వే నం.58 డీఎస్‌ఆర్ నగర్‌లో బస్తీ దావాఖానా కోసం స్థలం కేటాయించారు. ఈ స్థలంపై ప్రైవేట్ వ్యక్తులు కేసు వేడయంతో నిర్మాణం నిలిచిపోయింది. నాగోలు డివిజన్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంలో బస్తీ దవాఖానాకు శాశ్వత భవనాన్ని నిర్మించాలని డివిజన్ ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, వైద్య శాఖ అధికారులు స్పందించి బస్తీ దవాఖానాలను మళ్లీ బలోపేతం చేయాలని కోరుతున్నారు.

చలో రాజ్‌భవన్‌కు తరలిన కాంగ్రెస్ నేతలు



యూత్ కాంగ్రెస్ నేతలతో జక్కిడి శివచరణ్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న దేప భాస్కర్‌రెడ్డి

సైదాబాద్: కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన చలో రాజ్‌భవన్ కార్యక్రమానికి మలక్‌పేట నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు తరలి వెళ్లారు. బుధవారం టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నదన్నారు. బీజేపీతో కుమ్మక్కైన బీఆర్‌ఎస్ అదానీ అవినీతిపై ప్రశ్నించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దేప భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో..

దిల్‌సుఖ్‌నగర్: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో రాజ్‌భవన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నెక్లెస్ రోడ్ లోని ఇందిరా గాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు నిర్వహించిన ర్యాలీలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు తరలివెళ్లారు.



నిరసనలో పాల్గొన్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

గుర్రపుడెక్క నివారణకు చర్యలు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి

సైదాబాద్: సరూర్‌నగర్ చెరువులో గుర్రపుడెక్క నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి అన్నారు. చెరువులో పెరుగుతున్న గుర్రపుడెక్క కారణంగా ఇబ్బందులు పడుతున్నామని పరిసర కాలనీల వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆమె బుధవారం ఎంటమాలజీ విభాగం అధికారులతో కలిసి గుర్రపుడెక్క తొలగింపు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుర్రపుడెక్క కారణంగా పరిసర కాలనీల్లో దోమల బెడద తీవ్రమవుతోందన్నారు. చెరువులో గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించి మళ్లీ వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంటమాలజీ అధికారులు భారతి, నరేందర్ పాల్గొన్నారు.

ప్రజలను ఇబ్బంది పెడితే సహించం

హస్తినాపురం: ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదని వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి ట్రాన్స్‌జెండర్లను హెచ్చరించారు. నాగార్జునసాగర్ జాతీయ రహదారిపై గుర్రంగూడ, ఇంజాపూర్ ప్రాంతాల్లో రోడ్డుపై వసూళ్లకు పాల్పడుతున్న ట్రాన్స్‌జెండర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని ఏసీపీ ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఏసీపీ కాశిరెడ్డి మాట్లాడుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసి వదిలివేసినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.



ట్రాన్స్‌జెండర్‌లకు కౌన్సెలింగ్ ఇస్తున్న వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి

లైంగిక దాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు

హస్తినాపురం: ప్రేమ పేరుతో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి హత్యచేసిన కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లాకు చెందిన దబ్బుగోటి వెంకటేశ్ వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాహెబ్‌నగర్‌లో ఉండేవాడు. అదే ప్రాంతానికి చెందిన బాలికను ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడడమేగాక హత్య చేశాడు. నిందితుడిపై కేసు నమోదు చేసిన వనస్థలిపురం పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసుపై విచారణ చేపట్టిన న్యాయస్థానం నిందితుడికి జీవిత ఖైదు, రూ. 13వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పింది. నిందితుడికి శిక్ష పడేలా చేసిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీతను వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సత్కరించారు.



ఏపీపీని సత్కరిస్తున్న వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలి

నాగోలు: బస్తీ దవాఖానాలో డాక్టర్లు ప్రజలకు అన్ని వేళల్లో అందుబాటులో ఉండాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన కొత్తపేట డివిజన్ ప్రజానివస్ ఫేస్ 1 లోని బస్తీ దవాఖానాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సౌకర్యాలను పరిశీలించారు. ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్యసేవలు అందించాలని నూతన డాక్టర్లు సౌమ్య, రేష్మాలకు సూచించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.ఏ సమస్య వచ్చినా తనతో పాటు కాలనీ అసోసియేషన్ సభ్యులను సంప్రదించాలని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రామారావు, సెక్రెటరీ ప్రసాద్, లింగేశ్వర్, సాయి, రవి , రమణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్లతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని భవానీ ఎన్‌క్లేవ్ కాలనీలో బుధవారం పోచమ్మ అమ్మవారి ఆలయంలో సుబ్రమణ్యేశ్వరస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన పూజలు ఘనంగా జరిగాయి. వేకువ జామునే వేదపండితుల మంత్రోచ్చారణతో కాలనీవాసుల సమక్షంలో పూజలు ప్రారంభించారు. సుబ్రమణ్యేశ్వర స్వామి దయతో అందరూ ఆనందంగా ఉండాలని వారు ఆంకాక్షించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు నర్సిరెడ్డి, సంజీవరెడ్డి, టీ డబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ పునః ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న భక్తులు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



వంజరి వినోద్‌కుమార్

మలక్‌పేట: ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంజరి వినోద్ కుమార్ అన్నారు. బుధవారం మలక్‌పేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. చేవెళ్ల డిక్లరేషన్ ఊసేలేదని, ఎస్సీ, ఎస్టీ, విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. వితంతువులకు, వృద్ధులకు, వికలాంగుల పెన్షన్ పెంపును గాలికి వదిలేశారని ఆరోపించారు. మూసీ రెండువైపులా గోడలు నిర్మించాలని, మూసీ ప్రక్షాళన పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనపై అసంతృప్తిగా ఉన్నారని త్వరలో ప్రజలే పాలకులకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

సైదాబాద్: అయ్యప్ప శరణుఘోషతో సైదాబాద్ జయానగర్‌లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. బుధవారం జయానగర్‌లోని దివ్యజ్యోతి ఫౌండేషన్ నిర్వాహకుడు అనంత్‌రెడ్డి స్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వాముల భజన, భక్తి పాటలు ఆహుతులను అలరించాయి. అనంతరం స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు మోహన్‌రెడ్డి. భూపాల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.



పడిపూజలో పాల్గొన్న అనంత్‌రెడ్డి స్వామి

మహిళ ఆత్మహత్య



ఉమాశ్రీ మృతదేహం

హస్తినాపురం: ఓ మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంజాపూర్ రాజశ్రీ ఎన్‌క్లేవ్‌లో రామక్రిష్ణారెడ్డి, ఉమాశ్రీ దంపతులు నివాసం ఉంటున్నారు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటికి వచ్చిన ఉమాశ్రీ(52) తమ కారులో కూర్చుని పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కొద్ది సేపటి తర్వాత దీనిని గుర్తించిన ఉమాశ్రీ సోదరుడు ఆమెను వనస్థలిపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



ఎల్‌బీనగర్ పీఎస్‌లో వివరాలు తెలుసుకుంటున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

నాగోలు: ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌ను రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో సిబ్బంది పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో నమోదైన కేసులు, ఎఫ్‌ఐఆర్‌లు తదితర వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, అడిషనల్ డీసీపీ కోటేశ్వర్‌రావు, ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్యగౌడ్, ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, ఇబ్బంది పాల్గొన్నారు.

నూతన సంవత్సర కేలండర్ విడుదల



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ పాలకవర్గ సభ్యులు

వనస్థలిపురం: వనస్థలిపురం, సచివాలయనగర్‌లోని పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన సంవత్సర (2025) కేలండర్‌ను బుధవారం దేవస్థానం గౌరవ చైర్మన్ రంగినేని వెంకటరావు, చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య పాలకవర్గ సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి, భక్తుల సౌకర్యార్థం ఆలయంలో తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయంలో నిత్య హోమాలు, ప్రతిరోజు శ్రీవారి కల్యాణ మహోత్సవం, నిత్యాన్నదానం, ప్రతి పౌర్ణమికి శ్రీ రమా సహిత శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, వైస్ చైర్మన్ బీ.వీ.పాపారావు, కోశాధికారి కే.శ్రీధర్, సహాయ కోశాధికారి జే.రామలక్ష్మి, సాంబశివరావు, సూర్యనారాయణ, ఎం.జయసూర్య, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

జోనల్ కార్యాలయం ఎదుట బీజేపీ కార్పొరేటర్ల ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ కార్పొరేటర్లు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో ప్రజలు అత్యధికంగా ట్యాక్స్‌లు చెల్లిస్తున్నా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహి స్తున్నారని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీజేపీ జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహా రెడ్డి అన్నారు. నిధులు మంజూరులో అధికారుల వైఖరిని నిరసిస్తూ బుధవారం జోనల్ కార్యాలయం ఎదుట బీజేపీ కార్పొరేటర్లు ధర్నా నిర్వహించారు. జోనల్ కమిషనర్‌ను చాంబర్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల ఎల్‌బీనగర్ జోనల్ నుంచి ఆస్తి పన్ను, ఇతర పన్నుల రూపేనా దాదాపు రూ.50 కోట్లు వసూలవుతున్నాయని, ఇందులో కేవలం 23 డివిజన్లకు రూ.5 కోట్లు మాత్రమే నిధులు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. తమ డివిజన్ నిధులను ఓల్డ్‌సిటీకి తరలించడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ వసూలు చేస్తున్న నిధులను ఇక్కడే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. జోనల్ పరిధిలో నాగోలు, హయత్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్, మల్లాపూర్, హస్తినాపురం తదితర డివిజన్లలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, శివారు ప్రాంత కాలనీలైనందున ఆయా ప్రాంతాల్లో ప్రజలు తాగునీరు, డ్రైనేజీ, రోడ్డు, వీధి దీపాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలు తీర్చలేని తమను కాలనీ ప్రజలు నిలదీస్తున్నారని, వారికి ఏం సమాధానం చెప్పాలని జోనల్ కమిషనర్‌ను ప్రశ్నించారు. కాలనీలో డ్రైనేజీ పొంగినా జీహెచ్ఎంసీనే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని, వాటర్ వర్క్స్ , గ్రేటర్ అధికారుల మధ్య సమన్వయం లేనందున మరిన్ని సమస్యలు ఎదురవుతున్నాయని వారు ఆరోపించారు. అధికారులు పనిచేయడం లేదని, ఇంజినీరింగ్ అధికారులు ఎప్పుడూ కార్యాలయంలో అందుబాటులో ఉండరని జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. శివారు కాలనీల్లో ఏడాదిగా ఒక్క లైటు కూడా వేయలేని పరిస్థితి నెలకొందన్నారు.

జడ్సీని అడ్డుకున్న కార్పొరేటర్లు

జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌ను తన చాంబర్‌కు వెళ్లకుండ అరగంట పాటు మెట్ల వద్దనే అడ్డుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు తాము ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకున్నారు. నాలుగు నెలలుగా జోనల్ నుంచి అభివృద్ధికి నిధులు ఇవ్వకపోవడంతో కాలనీల్లో సమస్యలు పేరుకుపోతున్నాయన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించక పోతే జోనల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం కమిషనర్‌కు సమస్యలతో కూడి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, మొద్దులచ్చిరెడ్డి, ఆకుల శ్రీవాణి, కళ్లెం నవజీవన్ రెడ్డి, రంగ నర్సింహ గుప్తా, పవన్‌కుమార్, బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి నాయకులు చింతల సురేందర్‌యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి సురేష్‌కుమార్, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.